# బతుకులు

'ఒరే యాదయ్యా !... ఇంకా ఏన్నేళ్లుంటావురా సర్వీసులో !... నీకు రిటైర్మెంఎ లేదా ఏంటి ?.. సెంచురీ కొడితేగాని నువ్వు రిటైర్ కావేమోలేరా..' వీదిలోని లేసి వెటకారంగ మాట్లాడాడు ఓ పెద్దమనిషి.

'మీకేంటంట కడుపుమంట?-' వళ్లుమండింది యాదయ్యకు. జిల్లా పరిషత్ అటెండర్ అతను !

'కడుపుమంటనుకో... మరేదైనా అనుకో! అక్షరమ్ముక్కలేని నాశానీగాడివి. పళ్లూడి తలముగ్గు బుట్టయింది. కిలోమీటరు నడవగల వక్తి లేదు నీకు. శరీరం ముడతలు పడింది. చెవులు పనిచేయటం మానేసినయ్ - ఇలాంటి నిన్ను ఇంకా పనిలో పెట్టుకోవటం దండుగేకాదు... అన్యాయం కాదటరా? - అది సరే... ఇప్పుడు నీకెన్నేళు ? అదైనా తెలుసా? -' చమాడాలొలిచినట్టు చీవాట్లు పెట్టాడాయన.

"ఏమోనయ్యా... నువ్వడిగిన వాటికి జవాబు చెప్పలేను. ఎప్పుడు పుట్టానో... నావయసెంతో తెలవని నన్ను శానా ఏళ్లకితం సర్పంచ్‌గారు నామీద దయతలిచి స్కూల్లో అటెండర్ వుద్యోగం ఇప్పించారు. అప్పటి నుంచి చాకిరీ చేత్తునేవున్నాన్నా... జీతం తీసుకుంటూనే వున్నాను. మీ పరాచికాలాపి నన్నెల్లనీయండి... బడికి టైమవుతోంది... హెడ్ మాస్టరొస్తే నన్ను నానామాటలంటారు ఆలస్యమైతే... అంతేకాదయ్యా ఆప్సెంటేస్తరు. జీతంలో కటింగ్ తప్పదు.- అసలే ముగ్గురు పిల్లల తండ్రిని ! జీతంలో కోత పడిందంటే అప్పుపాలే...' సంజాయిషీ ఇచ్చుకుని ముందుకు సాగిపోయాడు.

ఇన్నేళ్ల నా సర్వీసులో ఒక సెకండ్ హాండ్ డొక్కు సైకిలైనా కొనుక్కోలేకపోయాడు. స్కూలు సైకిలూ ముసల్దయి మూలపడింది. దని బదులు కొత్తది కొనమని ఎంతమంది వచ్చి పోయిన హెడ్మాస్టర్లకు చెప్పినా శాంక్షను ఇవ్వరంటూ మొండికెత్తారు. ఆనాటి నుండి ఇంటి నుండి స్కూలు రెండు కిలోమీటర్లున్నా నడకే !. ఈ పాపిష్ఠి బతుక్కి అలవాటైంది.

హెడ్మాస్టరేమో రూల్సు మనిషి ! చండశాసనుడు. అల్లరి చేసే పిల్లకాయలను

కొట్టినట్టు తనపై కూడా చాలా సార్లు బెత్తంలో దడిపించాడు. ఇంకా నయం వంటి మీద దెబ్బేయలేదు. వయసులో పెద్దవోడినైనా చీత్కారంగ మాట్లాడతాడు. బాపనాయన కాబట్టి బూతులు మాత్రం తిట్టడు !.

ముప్పై రూపాయల జీతానికి వుద్యోగానిక్కుదిరాడు. ఇనేళ్లకుగాను... ఇప్పుడు కటింగులు పోను చేతికి రెండువేలొత్తున్నా... గడవటం కట్టంగవుంది. ధరలన్నీ మండిపోతుండయ్. పెళ్లాం పుల్లలు ఏరుకొచ్చి బువ్వ వండుతూండబట్టి సరిపోయింది. లేకపోతే కట్టెమోపులూ కొనలేక సావుకొచ్చేది.

రేషను షాపోడేమో అంతా దగాకోరోడు... కార్డు వున్నా... ఇరవైకిలోలు ఇయ్యకుండా తూకం దగా చేసి నాలుగు కిలోలు తక్కువిస్తున్నా అడిగేవోడే లేడు వాడిని. కిరసనాయిలూ అంతే ! అరలీటరు తక్కువ పోస్తాడు. అదేమిటంటే... అంతే పొమ్మంటాడు.

సొంత పూరిపాక తాతలనాటిది వుంది కాబట్టి ఇంటికి అద్దె కట్టాల్సిన అవసరం లేకపోయింది. లేకపోతే పూరిపాకకైనా వందరూపాయలు అద్దె కట్టాల్సి వచ్చేది.

ఆడపిల్లలైనా రత్నాలు... ముత్యాలు.. కాబట్టి సదువులో ఎక్కొచ్చారు. వాళ్లకి చేతనైన వుద్యోగమేదో సంపాదించుకున్నారు.

ఇదొకటే తనకు దేవుడు సేసిన మేలు ! ఇంతకూ... పిల్లలు అదురుట్టవంతులు ! సదుకోబట్టి సరిపోయింది. లేకపోతే మట్టి పిసుక్కు బతకాల్సి వచ్చేది.

వాళ్లమ్మ పోలిక ! ముగ్గురాడపిల్లలూ ఎర్రగ కనుముక్కు తీరుతో చూడచక్కని సుక్కల్లా అందమైనోళ్లనిచ్చాడా దేవుడు.

ఆపసోపాలు పడుతూ చెమటలు కక్కుతూ బడికి చేరుకున్నాడు యాదయ్య.

'దండాలయ్యా..' హెడ్మాస్టర్‌గారి ముఖంలోకి చూడ భయపడి తలవంచుకునే అన్నాడు.

'ఓరి నీ మొహం మండ... గంటలేటుగ వచ్చావేం ?- అక్కర్లేదు నువ్వెళ్లిపో.. ఆప్సెంటేసేస్తాను రోగం కుదురుతుంది రోజు జీతం కట్టైతే... అయినా నేనిలా రోజూ నోరు పారేసుకోవటమేగాని... నువ్వు స్కూలుకి టైముకు వొచ్చి చావవు కదా...?-'

అగ్గినాడు హెచ్.ఎమ్.

'అంత మాటనమాకండి అయ్యోరూ... నసత్తే నా పెళ్లాం ముండమోసుద్ది.. పిల్లలనాదలేతారయ్యా అందులోనూ ముగ్గురూ పెళ్లిళ్లు కావలసిన ఆడప్లిల్లయ్యా!...' కాళ్లమీద పడ్డాడు.

'ఇంక నువ్వేం చెప్తావ్ పెళ్లి వాళ్లకి ! - నీదగ్గరేముంది గనుక ?- పిల్లలు ముగ్గురూ వుద్యోగాలు చేస్తున్నారు కదా? ఇంకా ఎందుకు వాళ్లగురించి దిగులు?

'కన్నోడిని.. వాళ్లనో అయ్య చేతిలో పెట్టి అత్తారిళ్లకు ఎట్టా పంపించగలనానా మదనపడి చస్తుండానయ్యా!... తిండి సయించదు... కంటికి నిద్ర రాదు. నా అవస్థ ఏం సెప్పను సారూ...'

'యాదయ్యా' ... నువ్వో పాతకాలపు మనిషి ! ఈరోజుల్లో చదువుకుని వుద్యోగం చేసే ఆడపిల్లల గురించి కన్నవారు దిగులు పడాల్సిన పన్లేదు... ఎంచేతంటావేమో ?... ప్రేమ... ప్రేమ... అంటూ ఎవరి మొగుళ్లను వాళ్లే వెతుక్కునే రోజులివి ! -'

'అద్సరే అయోరూ... నాకు మస్తరిచ్చి పన్లోకి తీసుకోండి. ఈ వయసులో నన్ను బాదపెట్టమాకండి...' దీనంగ ప్రాధేయపడ్డాడు పడ్డాడు యాదయ్య.

X X X

ముగ్గురు బిడ్డలూ బాధ్యత తెలిసనోళ్లు కావటం నత అదురుష్ఠం ! -

పెద్దపిల్ల నర్స్ ట్రైనింగ్ చేసి కార్పోరేట్ ఆస్పత్రిలో నర్స్‌గా చేరింది. నెలకు ఎనిమిదివేలిస్తారు.

రెండోది నోరుపెట్టుకు బతగ్గలది ! ఎవరినీ లెక్కచేయదు. అందుకేనేమో గడుసరిది కావటాన పోలీసు కానిస్టేబులుద్యోగమొచ్చింది. తిండి పుష్టి శరీరదారుఢ్యం కల పిల్ల... చురుకైనది!. ఆటల్లో ప్రతిభాశాలి కావటాన ఎన్నో మెడల్సు... షీల్డులు సంపాదించుకుంది.

మూడవ అమ్మాయి పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పోస్ట్‌వుమన్‌గ చేస్తోంది. ఆడప్లికదానే జాలితో దయగల పోస్ట్ మాస్టారు అమ్మాయిని బయటికి పంపకుండా ఆఫీసులోనే అనధికారికంగ పనిచేయించుకున్నాడు.

వాళ్ల ఖర్చులకు కాస్త వుంచుకుని కొంత బ్యాంఉలో వేసుకుని సగం జీతం తెచ్చి నెలనెలా వాళ్లమ్మకిస్తారు. చదువు లేకపోయినా యాదయ్య పెళ్లాం చురుకైన తెలివైన ఆడమనిషి కావటంతో ఇంటి బాద్యతను ఆమె భుజాలమీద వేసుకుమోస్తోంది.

రెండోది పోలీసు కావటంతో కాయకూరలు పండ్లు రోజూ ఇంటికి తెస్తూంటుంది...

ఎందుకే ఇన్నిన్ని కొనుక్కొస్తావ్ రోజూ డబ్బు దండగ? - ' తల్లి అడిగేది.

'కొన్నవి కాదులేమ్మా ! నా యూనిఫారమ్ చూసి భయపిడి... వాళ్లూరికే ఇస్తూంటారు...' చెప్పి నవ్వేది.

'తప్పు కదే ?-'

'మామూళ్లెట్లాగూ తీసుకోనుకదా ? లంచమంటేనే చీదర నాకు !. కనీసం ప్రేమతో ఇచ్చే వీటినైనా తీసుకోండి అంటూ ప్రాధేయపడితే... కాదన్లేక తీసుకుంటాను. అంతేనమ్మా ! కొన్నవి కావు !'

ఈ యదవకు ఇంత తెలవైన సంతానాన్నిచ్చాడా దేవుడు?... అని ఎప్పుడూ ఆశ్చర్యపోతూంటాడు యాదయ్య. పిల్లలు ముగ్గురికీ ఆళ్లమ్మ తెలివితేటలే !. రూపాయి తనను అడక్కుండాసదువుకున్నారు. అదెట్లా అనడిగితే.. ఏందది? అదేందబ్బా.. ఆ ! గురుతుకొచ్చినాదిలే.. సాలరుసిప్పులతో సదువుకున్నామన్చెప్పారు ముగ్గురూ - ఎంతటి అదురుస్టమంతులు ? -

'ఏందయ్యా ఎప్పుడూ దిగాలుగా వుంటుండావ్ ఈమద్దెన...?-' భర్తతో అంది మారెమ్మ.

'దిగులుకాక మరేందే ? - పిల్లలేవెూ ఎదిగిపోయారా వుద్దోగాలు సేసుకుంటున్నారు గందాని మనం ఎన్నళ్లని నోరు మూసుకుని వుంటాం? - ఆళ్ల పెళ్లిళ్లు సెయ్యాలిగదే... పెళ్లి సెయ్యాలంటే బోలెడంత డబ్బు కావలగందే... అది మన కాడ యాడిది?...' యాదయ్య మాటల్లో బాధ ద్యోతకమైంది.

'అయితే పిల్లల పెళ్లిళ్లు సెయ్యకుండా ఇట్టనే ఎన్నాళ్లు మనకాడనే వుంచుకుంటామయ్యా మగడా ! గంతకు తగిన బొంత... మనకు తగిన పిల్లగాళ్లనిచ్చి పిల్లలమెళ్లో మూడు ముళ్లూ వేయిస్తే వాళ్లూ సంతోసిత్తారు - ఏ వయసులో జరగాల్సిన

ముచ్చట ఆ వయసులో జరగాలయ్యా.. ఓ పనిసెయ్...'

మారెమ్మ ముఖంలోకి బేలగ చూశాడు...

'మన పాక అమ్మితే ఎలాగుంటది?-'

ఆ మాటకి వులిక్కిపడ్డాడు యాదయ్య.

'మనకి ఈ కూత్తంత నీడ కూడా వుండకుండా పోద్దే... అయినా కూలిపోవటానికి సిద్ధంగ వున్నదాన్ని ఎవరు కొంటారే?... అంతా కలిపినా డెబ్బై గజాల స్థలం కూడా లేదు. తెగనమ్మితే... ఒక్క పిల్ల పెళ్లికిక్కూడా చాలదే... ' గుడ్ల నీరు కుక్కుకుంటూ అన్నాడు.

'బాదపడమాకయ్యా !.. నువ్వన్నదీ నిజమే!... పెళ్లిళ్ల కోసం పాకను అమ్మేత్తే... రేపు నువ్వు రిటైరయింతర్వాత ఎక్కడుండాల మనం ? - వద్దులే... అమ్మద్దులే... కానీ పిల్లలేమో వయసుకొచ్చిన ఆడపిల్లలాయె?. ఆళ్ల మనసులు ఏ క్షణాన ఎట్టా మారతయ్యో చెప్పలేమయ్యా ! అదీగాక రోజులు కూడా ఎంత ముదనష్టంగ వున్నాయో సూత్తున్నాంగదా !?... ఆడపిల్లల వెంట పోకిరీ వోళు పడటం... ఏడిపించటం బెదిరించటం... యాసిడ్ పొయ్యటం... లేకపోతే సంపటం !... అబ్బబ్బ ఆడపిల్లలకు రక్షణ లేకుండాపోయిన పిపిట్టి రోజులైనయ్. మన జాగ్రత్తలో ఎంత వున్నా... చెడ్డకాలం వచ్చిందంటే ఆడపిల్లల బతుకు బుగ్గైపోద్ది ! అదే నా బయం...'

'నా దిగులు కూడా అదేనే... దారితెన్నూ కనుపించటంలేదు. పోనీ అప్పుచేసి పెళ్లిళ్లు సేద్దామా అంటే లచ్చల రూపాయలు మనకు అప్పెవిత్తారే... మనం బీదోళ్లమైపోతిమి ! - సావు తప్ప నాకు మరోదారి అవుపించకుండా వుందే...'

'ఛ ! ఏం మాటలయ్యా అవి ? - పిచ్చోడిలా వాగమాకు... సర్లే తర్వాత మాటాడుకోవచ్చుగాని... బువ్వ తిందువుగాని... లెగు...'

ఏం తిండో? ఏం కతో ? మనం తిండికోసమే పుట్టాంగాని బాధ్యతలు తీర్చుకోటానిక్కాదే... గొణుక్కుంటూ బైట గాబులో వున్న నీళ్ల డబ్బాతో ముంచుకుని కాళ్లుకున్న మట్టి శుభ్రపర్చుకుని లోనకి నడిచాడు యాదయ్య.

X X X

'ఇదిగో నిన్నే... అప్పుడే నిద్రపోయినావంటయ్యా'... బైట అరుగుమీద పడుకున్న

మొగుడి కాళ్ల దగ్గర కూర్చుని మెల్లగా పిలిచింది మారెమ్మ.

'పొద్దుపోనాది... నిద్దరోనీవా ఏంది?-'

'నీకెంత కాడికీ నిద్దరేనిద్దర ! కూసంత నే సెప్పేది పెవినేసుకో...'

లేచు కూర్చుని ఆవులించాడు. బద్ధకంగ వళ్లు విరుచుకున్నాడు యాదయ్య.

'ఆ !... అదేందో ఇప్పుడు సెప్పేడు...' విసుక్కున్నాడు.

'ఏం లేదయ్యా... పిల్లలు ముగ్గురూ ఇంటి కరుచు కింద వాళ్లు సంపాదించే దాంట్లో నెలనెలా నాకిత్తున్నారు కదా ? -'

'అయితే...'

పిల్లలిచ్చే డబ్బులో కొంత దాపెడుతూ వచ్చానయ్యా...

'అట్టనా ! అంతాకలిపి ఎంతుంది నీకాడ? -

'నిన్ననే లెక్కేశానయ్యా... పాతికవేలదాకా వుంది...'

ఓస్ ! అంతేనా... ఈ కూతంత ఒక్క పిల్ల పెళ్లికి కూడా సాలదే పిచ్చి మొగమా?...- అయినా ఆ డబ్బులు వాళ్ల కట్టార్జితమాయె... అది వాళ్ల అవసరాలకు వుంచు !... నన్ను పడుకోనీ...

'అవునూ నువ్వు ఈ ఏడాదేగా రిటేరయ్యేది. ఇన్ని సంవత్సరాలు చాకిరీ చేశావుగందా? కడాకు నీ చేతికి ఎంతొస్తది...'

'నా బొందొస్తది ! - నేనేమైనా కలకటేరుద్దోగం సేసి రిటేరవుతూండానే ! నాజీతమెంత ! బతుకుకెంత ? - మా హెడ్ మాస్టారు చెప్పిన దాన్ని బట్టి అంతా కలిపి పాతికవేలు వస్తదేమో?'

'అట్టనా పాతిక వేలంటే తక్కువేం కాదు. పింఛను ఎట్టాగూ కాస్తో కూస్తో వస్తది గందా... అది మనిద్దరికీ సాలకపోదు. నాకాడున్నది... అదేనయ్యా దాచిపెట్టింది. నీకు రాబోయేదీ కలిపితే ఇద్దరాడపిల్లల పెళ్లిళ్లవుతయ్ - మరో పాతిక వేలు మన పాక తనఖాపెట్టి తెచ్చామనుకో ఆ వచ్చే డబ్బుతో మూడో పిల్ల పెళ్లికి సరిపోద్ది - నీ పింఛనుతో తనఖా బాకీ నెలకింతని తీర్చేసుకుందాం ! - ఎట్టాగుంది నా అవిడియా ? -

'ఏడిసినట్టుంది... పాతికవేలు కట్నమిస్తామంటే అడుక్కుతినేవాడు కూడా రాడీ

రోజుల్లో

తెలుసా ? - వుద్దోగం చేసే మన పిల్లలు 'చీపు' సంబందాలొప్పుకోరే - గొప్ప పెళ్లి కొడుకులను మనం తేలేము... అంధకనీ.. నన్ను తొంగోనీ... కళ్ళు బరువెక్కుతుండయ్... నిద్ర ముంచుకొచ్చేస్తావుంది.' కూర్చున్నవాడల్లా అరుగుమీద వొరిగి నిద్రలోకి జారబడ్డాడు.

'ఈ మడిసెప్పుడూ ఇంతే...' గొణుక్కుని లోనికెళ్లి తడిక తలుపు వేసుకుంది మారెమ్మ.

X X X

'నువ్వేం బాధపడకు నాయనా ! - ఉద్యోగంలో రిటైర్మెంటు... పుట్టినాక చావు రాక తప్పవ్ ! - మేం ముగ్గురం సంపాదిస్తున్నాం కాదా... ఇంక నీకెందుకు దిగులు..' పెద్ద కూతురు సావిత్రి ఓదార్పుగ అంది యాదయ్యతో.

'అవున్నాయనా... మనకీ పాక సాలటం లేదు ఇంకో పెద్దిల్లు అద్దెకు తీసుకుని ఆడికి పోదాం...' రెండో పిల్ల సరస్వతి మనసులో మాట చెప్పింది !

'మన పాక అమ్మేద్దాం ! మనకు దీనితో పనేంటి?...' మూడో కూతురు అనసూయ తన మనసులో మాట బైటపెట్టింది.

'అమ్మటందేనికే అనసూయా ! ఎవరికైనా అద్దెకిస్తే సరి... కాస్తో కూస్తో డబ్బులొస్తుంటయ్. కదు నాయనా ? నువ్వేమంటావ్ ? సావిత్రి కలుగజేసుకుంది.

'తర్వాత మాటాడుకోవచ్చుగానీ... ముందు బువ్వతిందురుగా లేగండి...' మారెమ్మ కూర్చున్నదల్లా లేస్తూ అంది. '

'అమ్మా ! నువ్వు కూర్చో... అన్నం తర్వాత తినవచ్చులే ! సరస్వతి తల్లి చెయ్యిపట్టుకు గుంజింది.

'ఇద్దరూ మేం చెప్పేది వినండి ముందు. మా పెళ్లిళ్ల గురించి దిగులు పడద్దు ! మాకు నచ్చినోళ్లను మేం పెళ్లి చేసుకుంటాం ! - ఏం ? అర్థమైందా? - ' మనసులో మాట చెప్పింది సావిత్రి.

మారెమ్మ యాదయ్య ఇద్దరూ పెద్దపిల్ల సావిత్రి మాటలు విని నిర్ఘాంతపోయారు.

'మేమా చదువుకుని సంపాదించుకుటున్న వాళ్లం ! మాకెలాంటి బర్త కావాలో మేం నిర్ణయించుకోగలం ! మాగురించి దిగులుపడి మనసు పాడు చేసుకోవద్దు మీరిద్దరూ... మళ్లీ సావిత్రే నొక్కివక్కాణించింది.

'ఏందే పిల్లా అట్లాగంటావ్?' - మారెమ్మ సావిత్రి వేపు చూస్తూ అంది.

'అవునమ్మా !... నే పనిచేసే హాస్పిటల్లో డాక్టరు నేను ప్రేమించుకున్నాం. ఇద్దరం పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం ! పెళ్లి అయిన వెంటనే మేమిద్దరం అమెరికా వెళ్లిపోతాం! ఇకపోతే... ఒసేవ్ సరస్వతీ నీ మనసులోని మాట కూడా అమ్మా నాన్నలకు చెప్పేయవే...' సావిత్రి చొరవ తీసుకుని మాట్లాడింది.

కన్నవారు ప్రేక్షకుల్లా పిల్లలు చెప్పే వారి నిర్ణయాలువింటూ బొమ్మల్లా... శిలా ప్రతిమల్లా మౌనంగ వున్నారు.

'అబ్బ నాకు సగ్గేసొందందే...' సరస్వతి ముఖాన్ని దోసిట్లో దాచుకుంది.

'అయితే నన్ను చెప్పమంటావా?-'

'వద్దుదొద్దులే !- నాయనా మా స్టేషన్ ఎస్సైకింకా పెళ్లికాలేదు. కొత్తగ వుద్యోగంలో చేరాడు నేనంటే ఆయనకు చాలా ఇష్టం. మీకు చెప్పినాకనే పెళ్లి చేసుకుంటానని చెప్పినాను. మీ ఇద్దరికీ అంగీకారమేనా ? - '

'ఇన్స్పెక్టరు బాబే... కానిస్టేబులైన నిన్ను పెళ్లిచేసుకుంటానంటుంటే... మేమెట్లా వద్దనగలమే!- నిన్ను చేసుకోటం పిలగాడి ఇంట్లో వాళ్లకూ ఇష్టమేనా?-'

'అందరికీ ఇష్టమే మమ్మీ !- మీరు సరేనంటే అక్క పెళ్ళి అయిన తర్వాత నాది...'

'ఇక నీ యవ్వారమేందే అనసూయా? - మాట్లాడు నీ మొగుడ్ని వెతుక్కుండావా?-' మారెమ్మ కూతుర్ని చూస్తూ అడిగింది.

'మరీ... మరీ...'

'నాన్చటం దేనికే.... పాయింట్కొచ్చెయ్ అనసూయా...' సరస్వతి తొందరచేసింది.

'అవునమ్మా ! మా పోస్టాఫీసులో పెళ్లికాని గుమాస్తా గోవిందరావు గారే... నన్ను పెళ్లాడతానంటున్నాడే... ఇంకా నామనసులో మాట ఆయనతో చెప్పలేదు

మీరేమంటారోని. మీరొప్పుకుంటే ఇద్దరక్కలకూ పెళ్లిళ్లు అయ్యేదాకా నేను ఆగుతాను ! గోవిందరవుగారినే పెళ్లాడతాను...' మురుస్తూ మనసులోమాట వెళ్లకక్కింది అనసూయ.

ఈమ విషయాలు చెప్పాక సిగ్గుపడుతూ వాకిల్లోకి వెళ్లిపోయారు ముగ్గురు అక్కచెల్లెళ్లు.

ఏమైనా పిల్లల నుదిటన మంచిరాతే రాశాడా బగమంతుడు. మనసుకు నచ్చినవాళ్లనే వెతుక్కుని పెళ్లిచేసుకోవాలనుకుంటున్నారు. రోజులెంతగా మారిపోయినాయో చూస్తున్నావా మారెమ్మా ! - మనం సేతగానోళ్లమని పిల్లలకు అర్థమైపోనాది. ఆళ్ల పెళ్లిళ్లు ఆళ్లే చేసుకుటారేమో అన్పిత్తోంది. కనీసం అల్లుళ్లని ఇంటికి పిలిచి హైకలలాస్ భోజనం పెట్టలేని పేద స్థితే మనది. అసలు వాళ్ల మొగుళ్లెలా వుంటారో కూడా మనకు తెలవదు. మనం సూడలేదు - మందునాటికి సూత్తామోలేదో కూడా తెలవకుండావుందీ !...' బాధతో యాదయ్య మనసు మూలిగింది.

'బాదపడమాకయ్యా ! మన ఆడప్లిలలకోసమైనా గుండెనిబ్బరంతో బతకాలమనం !- నాకు మాత్రం సానా సంతోసంగా వుందయ్యా ! వాళ్ల బతుకులు చిరిగిన విస్తరాకులు కాకుండా దర్జాగ మనసైనోడిని మనువాడి సుకపడబోతున్నారు. ఆ తీప్తి సాలయ్యా మనకు...' ఆనందం దు:ఖం మిళితమైనయ్ మారెమ్మ మాటల్లో ఎంతైనా తల్లిది ఆడమనసుకదా!?!

---సమాప్తం---